


sahanamvande.com

epaper.sahanamvande.com

# సహనం వందే

హైదరాబాద్ | 22-10-2026 గురువారం | సంపుటి-02 సంచిక : 177 EDITOR: ROHINI




# అమెజాన్‌లో జాబ్స్ సునామీ

## 3 లక్షలకుపైగా కొత్త ఉద్యోగాలు




ఉపాధి కల్పనలో అమెజాన్ సంచలనం సృష్టిస్తోంది. రాబోయే పండగ సీజన్ కోసం ఏకంగా మూడు లక్షలకు పైగా ఉద్యోగాల భర్తీకి ప్రణాళిక సిద్ధం చేసింది. గతేడాయితో పోలిస్తే ఈసారి నియామకాలు 20 శాతం పెరిగాయి. మిగతా రిటైల్, లాజిస్టిక్స్ మార్కెట్లు మందకొడిగా సాగుతున్న వేళ... బ్లూమ్‌బెర్గ్ నివేదికల ప్రకారం ఈ స్థాయిలో ఉద్యోగాలు ప్రకటిస్తున్న ఏకైక దిగ్గజం అమెజాన్ మాత్రమే కావడం విశేషం. - సహనం వందే, హైదరాబాద్

- పండగ సీజన్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- గంటకు 1700 రూపాయల వేతనం
- లాజిస్టిక్స్ రంగంలో తీవ్ర పోటీ
- తాత్కాలిక సిబ్బందికి శాశ్వత అవకాశాలు

పండగ సీజన్ వస్తోందంటే చాలు ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌లలో ఆఫర్ల మోత మోగిపోతుంటుంది కదా. మరి మనకి నచ్చిన వస్తువులను ఆర్డర్ చేస్తే గడప ముందుకు గంటల వ్యవధిలో తెచ్చిచ్చే డెలివరీ బాయ్స్ వెనుక ఎంత పెద్ద సామ్రాజ్యం ఉంటుందో ఎప్పుడైనా ఆలోచించారా? ఇప్పుడు ఏకంగా మూడు లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయడానికి ప్రపంచ దిగ్గజ సంస్థ సిద్ధమైంది. మిగతా కంపెనీలన్నీ ఖర్చులకు వెనకాడితే, ఈ ఈకామర్స్ రారాజు మాత్రం కొలువుల జాతర మొదలుపెట్టింది.

### ఉద్యోగులకు భారీ వేతనాల ఆఫర్

అమెరికాలోని సియాటిల్ ప్రధాన కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటన ప్రకారం ఇందులో శాశ్వత, పార్ట్‌టైమ్, సీజనల్ కొలువులు అందుబాటులో ఉన్నాయి. ఈ తాత్కాలిక ఉద్యోగులకు భారతీయ కరెన్సీ లెక్కన గంటకు దాదాపు 1700 రూపాయల వరకు చెల్లించనున్నారు. పండగ రద్దీని తట్టుకోవడానికి, డెలివరీ నెట్‌వర్క్‌ను వేగవంతం చేయడానికే ఈ ఆకర్షణీయ వేతనాలు ఇస్తున్నారు. జనవరి వరకు వారానికి కనీసం 30 గంటలు పనిచేసే వారికి వైద్య సదుపాయాలు కల్పిస్తారు. అంతేకాదు శాశ్వత ఉద్యోగులుగా మారే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నారు.

### రిటైల్ రంగంలో భిన్న పరిస్థితులు

అమెజాన్ దూకుడుగా ముందుకు వెళ్తుంటే వాల్‌మార్ట్, టార్గెట్ కార్పొరేషన్ వంటి రిటైల్ దిగ్గజాలు తమ వివరాలను వెల్లడించడానికి వెనుకాడాయి. ఛాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్ అంచనాల ప్రకారం, మొత్తం రిటైల్ రంగంలో సీజనల్ రిక్రూట్‌మెంట్ గతేడాది ఉన్న 4.5 లక్షల కంటే చాలా తక్కువగా ఉండనుంది. ఆర్థిక మాంద్యం భయాలతో మిగతా కంపెనీలు వెనకడుగు వేస్తుంటే, ఈకామర్స్ రారాజు మాత్రం 3 లక్షల నియామకాలతో తన ఆధిపత్యాన్ని చాటుకుంటూ సాహసోపేతమైన అడుగు వేసింది.

### నియామకాల వెనుక ముఖ్య కారణాలు

ఈకామర్స్ ప్లాట్‌ఫారమ్‌లపై వస్తున్న భారీ ఆర్డర్ల ఒత్తిడిని తట్టుకునేందుకే ఈ మానవ వనరులు అవసరమవుతున్నాయి. ఐఫోన్ వంటి ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌లు మొదలుకుని ప్రతి చిన్న వస్తువుపై ఇస్తున్న భారీ తగ్గింపుల వల్ల భారత్, అమెరికా సహా గ్లోబల్ మార్కెట్లలో కొనుగోలుదారులు ఎగబడుతున్నారు. గోడౌన్లలో సరుకులు సర్దడం, ప్యాకింగ్, డెలివరీ విభాగాల్లో ఏ చిన్న పొరపాటు జరగకుండా ఉండేందుకు కొత్త, అనుభవజ్ఞులైన సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి రంగంలోకి దింపుతున్నారు.

### మార్కెట్ పోకడలు... ప్రభావం

అమెజాన్ అనుసరిస్తున్న ఈ సరికొత్త రిక్రూట్‌మెంట్ విధానం చిన్న స్థాయి కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మార్కెట్‌లో పోటీని తట్టుకోవాలంటే మిగతా సంస్థలు కూడా తమ వేతనాల తీరును మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. లేదంటే సిబ్బంది అమెజాన్ వైపే మొగ్గు చూపే ప్రమాదం ఉంది. ఫలితంగా ఇది రాబోయే రోజుల్లో ఇతర రిటైల్ రంగాల్లో కూడా ఉపాధి అవకాశాలు పెరగడానికి, వేతనాల పెరుగుదలకు దారితీస్తుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

### సాంకేతికత... మానవ వనరులు

టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ ఉద్యోగాలు కనుమరుగవుతున్నాయని భావిస్తున్న తరుణంలో ఈ భారీ నియామకాలు నిరుద్యోగ యువతకు ఎంతో కొండంత ఆసరాగా నిలుస్తున్నాయి. అయితే వ్యాపార సంస్థల లాభాల కోసం చేసే ఈ ఏర్పాట్లు సాధారణ కార్మికుల జీవితాల్లో ఎంతవరకు వెలుగులు నింపుతాయనేది ఆలోచించాల్సిన విషయమే. ఈ పండగ సీజన్ ముగిసేసరికి ఈకామర్స్ దిగ్గజం సాధించబోయే లాభాలు ఏ స్థాయిలో ఉంటాయో కాలమే నిర్ణయిస్తుంది.



# చదువుల దేశం... నోబెల్ శూన్యం

## దేశంలో మేధో సంపత్తి ఉన్నా వెనుకబాటు

- మన విద్యా సంస్థల్లో సైంటిఫిక్ స్వేచ్ఛ కరువు
- బ్రిటిష్ కాలపు బ్యూరోక్రసీనే ప్రధాన సమస్య
- కార్పొరేట్ లీడర్లు వేరు పరిశోధకులు వేరు
- ఐఐటీ గాంధీనగర్ ప్రొఫెసర్ జైసన్ విశ్లేషణ




ప్రపంచాన్ని శాసించే అతిపెద్ద మేధో సంపత్తి, కోట్లాది మంది యువత, అంతులేని సైంటిఫిక్ వర్క్‌ఫోర్స్ ఉన్న మన దేశం... సొంత గడ్డపై రీసెర్చ్ చేసి నోబెల్ బహుమతులు సాధించడంలో ఎందుకు వెనుకబడిపోయింది? మన దగ్గర టాలెంట్ లేదనా? లేక మన బడులు, యూనివర్సిటీల వెనుక ఏదైనా పెద్ద చీకటి రహస్యం దాగుందా? ఐఐటీ గాంధీనగర్ ప్రొఫెసర్ జైసన్ మంజలి రాసిన ఓ కీలక వ్యాసం ప్రకారం... భారతదేశంలో సైన్స్, రీసెర్చ్ రంగాల పరిస్థితిపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఎంతో మంది భారతీయ మూలాలు ఉన్నవారు విదేశాలకు వెళ్లిన తర్వాతే నోబెల్ గెలుచుకుంటున్నారు. దీనికి కేవలం నిధుల కొరత మాత్రమే కారణం కాదు, మన వ్యవస్థాపరమైన లోపాలు కూడా ప్రధాన కారణమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. - సహనం వందే, హైదరాబాద్

మనం చిన్నప్పటి నుంచి చదువుకునే పద్ధతిని గమనిస్తే అసలు సమస్య ఏమిటో స్పష్టంగా అర్థమవుతుంది. మన స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీలు ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించడానికి బదు? కేవలం విధేయతను మాత్రమే నేర్పుతున్నాయి. గురువు చెప్పిందే వేదం, అధికారులు చెప్పిందే శాసనం అనే మూస పద్ధతిలో మన విద్యా వ్యవస్థ నడుస్తోంది.ఎవరైనా విద్యార్థి లేదా యువ పరిశోధకుడు ధైర్యంగా ఒక ప్రశ్న అడిగితే, దాన్ని విజ్ఞాన జిజ్ఞాసగా కాకుండా అధికార ధిక్కారంగా చూసే ప్రమాదకర ధోరణి కనిపిస్తుంది. ఇలాంటి భయంతో కూడిన వాతావరణంలో సరికొత్త ఆవిష్కరణలు పుట్టుకురావడం అసాధ్యం.

### కార్పొరేట్ లీడర్లు వర్సెస్ ఒరిజినల్ రీసెర్చర్లు

మనం ఎప్పుడూ కార్పొరేట్ కంపెనీలకు సీఈఓలుగా మారుతున్న ప్రతిభావంతుల గురించే గొప్పగా మాట్లాడుకుంటాం. గూగుల్ అధినేత సుందర్ పిచాయ్ లాంటి ఎంతో మంది దిగ్గజాలు మన దేశం నుంచే ప్రపంచ స్థాయికి ఎదిగారని గర్వపడుతుంటాం. కానీ ఒక కంపెనీని నడిపించడం వేరు, దానికి కావలసిన సరికొత్త టెక్నాలజీలను కనిపెట్టడం వేరు అనే విషయాన్ని మనం తరచూ మర్చిపోతుంటాం. మేనేజ్ మెంట్ లీడర్‌షిప్ వేరు, సైంటిఫిక్ ఇన్నోవేషన్ వేరు. మన విద్యా సంస్థలు అద్భుతమైన మేనేజర్లను తయారు చేస్తున్నాయేమో కానీ, ప్రశ్నలను సృష్టించే ఒరిజినల్ రీసెర్చర్లను మాత్రం ప్రోత్సహించడంలో విఫలమవుతున్నాయి.

### పాత బ్యూరోక్రసీ... మానసిక భద్రత

మన యూనివర్సిటీలన్నీ కూడా బ్రిటిష్ కాలం నాటి పాత బ్యూరోక్రటిక్ విధానాలనే ఇప్పటికీ గుడ్డిగా అనుసరిస్తున్నాయి. పై అధికారుల పెత్తనం, నిబంధనల పేరుతో సాగే వేధింపులు మన పరిశోధనా సంస్థల్లో తీవ్రమైన స్తబ్దతను సృష్టిస్తున్నాయి. పరిశోధనలు విజయవంతం కావడానికి మానసిక భద్రత అత్యంత ప్రధానమైనది. ఒక రీసెర్చర్ తన సీనియర్‌తో విభేదించినప్పుడు అది అతని వ్యక్తిత్వంపై దాడిగా మారకూడదు. కేవలం ఆ సైంటిఫిక్ డేటాపై మాత్రమే చర్చ జరగాలి. ప్రయోగం విఫలమైతే చర్చించుకునే స్వేచ్ఛ ఉంటేనే నిజమైన సైన్స్ ఎదుగుతుంది.

### ఏఐ కాలంలో సరైన ప్రశ్నలు

మనం గ్లోబల్ స్థాయిలో పోటీ పడాలంటే కేవలం డిగ్రీలు, మార్కుల వేట నుంచి బయటపడాలి. ఏఐ సాంకేతికత విపరీతంగా పెరుగుతున్న ఈ రోజుల్లో సమాచారాన్ని గుర్తుపెట్టుకోవడం ముఖ్యం కాదు, అసలు ఒక సరైన ప్రశ్నను ఎలా అడగాలో తెలుసుకోవడం ముఖ్యం. ఏఐ మనకు సమాధానాలను ఇస్తుంది కానీ, అసలు ఆ సమాధానం సరైనదా కాదా అని ప్రశ్నించే విచక్షణను మన విద్యార్థులకు అందించాలి. ఆ స్వేచ్ఛను ఇవ్వని ఏ విద్యా వ్యవస్థ కూడా రేపటి రోజున నోబెల్ స్థాయి అద్భుతాలను సృష్టించలేదు.

### మార్పుతోనే నోబెల్ కల సాకారం

కేవలం బడ్జెట్‌లో కోట్లు కేటాయించడం వల్ల మాత్రమే రీసెర్చ్ రంగం బాగుపడిపోదు. పరిశోధనలకు కావలసిన నిధులతో పాటు ఆలోచించడానికి పూర్తి స్వేచ్ఛను కూడా ప్రభుత్వాలు, యూనివర్సిటీలు అందించాలి. అథారిటీ ముందు తల వంచడం కంటే, సత్యం కోసం నిలబడే తత్వాన్ని మన విద్యా సంస్థలు పెంపొందించుకోవాలి. ఎప్పుడైతే మన క్యాంపస్‌లు భయం నీడ నుంచి బయటపడి ప్రశ్నించే స్వేచ్ఛను ఇస్తాయో, అప్పుడే మన సొంత గడ్డపై నోబెల్ బహుమతులు సాధించే రోజులు మళ్లీ వస్తాయి.

# పెట్రోల్ వెహికిల్స్

## దసరాకి ఎలక్ట్రిక్ కార్లదే హవా

- పండుగ సీజన్‌లో ఈవీల సంచలనం
- పండుగ వేళ ఎలక్ట్రిక్ వాహనాల జోరు
- రికార్డు స్థాయి అమ్మకాలతో ధూం ధాం
- వెనకబడిన పెట్రోల్, డీజిల్ వాహనాలు
- పర్యావరణ స్పృహతో మొదలైన మార్పు

పండుగ సీజన్లో ఈసారి రోడ్లపై ఏ వాహనాల సందడి ఎక్కువగా కనిపించిందో తెలుసా? మరేవో కాదండి.. అచ్చంగా ఎలక్ట్రిక్ వాహనాలే! పెట్రోల్ బంకుల చుట్టూ తిరిగే రోజులకు స్వస్తి చెప్పి, జనాలు ఇప్పుడు ఈవీల వైపు ఎలా పరుగులు తీస్తున్నారో చూస్తే నిజంగా ఆశ్చర్యపోవాల్సిందే. - సహనం వందే, హైదరాబాద్



ఈ దసరా పండుగ సీజన్‌లో ఆటోమొబైల్ రంగానికి సంబంధించి ఫాడా విడుదల చేసిన గణాంకాల్లో ఎలక్ట్రిక్ వాహనాలే అసలైన ట్రెండ్ సెట్టర్‌గా నిలిచాయి. సంప్రదాయ వాహనాల మార్కెట్ నెమ్మదించినప్పటికీ, ఈవీల రిటైల్ అమ్మకాలు ఏకంగా 26.78 శాతం దూసుకెళ్లాయి. ఈ నవరాత్రి సమయంలో దేశవ్యాప్తంగా మొత్తం 1.17 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే సమయంలో ఈ సంఖ్య 92,628 యూనిట్లు మాత్రమే. దీంతో మొత్తం పండుగ సేల్స్‌లో ఈవీల వాటా సుమారు 10.5 శాతానికి ఎగబాకింది.

### 25 శాతం పెరుగుదలతో ఎలక్ట్రిక్ కార్ల జోరు...

ముఖ్యంగా ఎలక్ట్రిక్ టూ-వీలర్ల విభాగం మార్కెట్‌ను పూర్తిగా శాసించింది. ఈ నవరాత్రుల్లో టూ-వీలర్లు ఏకంగా 33.41 శాతం వృద్ధితో 75,758యూనిట్లకు చేరుకున్నాయి(గత ఏడాది 56,787 యూనిట్లు). పెట్రోల్ బైకుల నిర్వహణ ఖర్చుకు భయపడి యువత, ఉద్యోగులు ఈవీ స్కూటర్ల వైపే మొగ్గు చూపుతున్నారు. ఇక కుటుంబాలు ఇష్టపడే ఈవీ కార్ల విభాగం కూడా అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఈ నవరాత్రుల్లో 12,305 ఎలక్ట్రిక్ కార్లు అమ్ముడయ్యాయి. ఇది గత ఏడాది నమోదైన 9,768 యూనిట్లతో పోలిస్తే 25.97 శాతం ఎక్కువ. మార్కెట్లో కొత్త మోడళ్లు రావడం, తక్కువ మెయింటెనెన్స్ ఉండటంతో కుటుంబాలు వీటి కొనుగోలుకు ముందుకు వస్తున్నాయి.

### ఆటోలు... వాణిజ్య వాహనాలు

నగర వీధుల్లో తిరిగే త్రీ-వీలర్ల విభాగంలోనూ ఎలక్ట్రిక్ ఆటోలదే హవా నడిచింది. వీటి రిజిస్ట్రేషన్లు 10.51 శాతం పెరిగి 28,086 యూనిట్లకు చేరాయి. నగరాల్లోని ఆటోల్లో సగానికి పైగా ఇప్పుడు ఎలక్ట్రిక్‌గా మారుతున్నాయి. ఇంధన ఖర్చు తగ్గడం, ప్రభుత్వ సబ్సిడీలు కూడా దీనికి దోహదపడుతున్నాయి. ఇక కమర్షియల్ వెహికల్స్ విభాగంలోనూ ఈవీలు ఆధిపత్యం నిరూపించుకున్నాయి. వాణిజ్య వాహనాల విక్రయాలు ఏకంగా 96 శాతం వృద్ధిని నమోదు చేసి 1,288 యూనిట్లకు చేరడం విశేషం. లాజిస్టిక్స్, రవాణా సంస్థలు ఇంధన భారాన్ని తగ్గించుకోవడానికి ఎలక్ట్రిక్ ట్రక్కులు, వ్యాన్ల వైపు వేగంగా అడుగులు వేస్తున్నాయి.

### ఈవీ షోరూమ్‌ల వద్ద కస్టమర్లు బారులు...

సాధారణ షోరూమ్‌లు మామూలుగా ఉన్నప్పటికీ, ఈవీ షోరూమ్‌ల వద్ద కస్టమర్లు బారులు తీరడం ఈ పండుగ ప్రత్యేకతగా నిలిచింది. పెట్రోల్ పై వేల రూపాయలు ఖర్చు చేయడం కంటే ఒక్కసారి ఛార్జ్ చేసుకుని వందల కిలోమీటర్లు ప్రయాణించవచ్చనే ఆలోచనతో మధ్యతరగతి కొనుగోలు ధోరణి మారాయి. డీలర్లు, తయారీదారులు సరికొత్త మోడళ్లను విడుదల చేయడం, సులువైన ఫైనాన్స్, తక్కువ ఈఎంఐ ఆప్షన్లు లభించడం ఈ కొనుగోళ్లకు ఊపునిచ్చాయి. భారతీయ రోడ్లపై పెట్రోల్ పొగలు వదిలే వాహనాల స్థానంలో నిశ్శబ్దంగా దూసుకెళ్లే ఈవీలే భవిష్యత్తు అని ఈ దసరా సేల్స్ నిరూపించాయి.

### సంప్రదాయ వాహనాల విక్రయాల క్షీణత

అయితే, ఈవీల జోరు ఒక ఎత్తైతే.. మరోవైపు సంప్రదాయ వాహనాల పరిస్థితి మాత్రం భిన్నంగా కనిపించింది. దేశవ్యాప్తంగా ఓవరాల్ వెహికల్ రిజిస్ట్రేషన్లు గత ఏడాదితో పోలిస్తే 6.52 శాతం మేర తగ్గిపోయాయి. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్ ప్యాసింజర్ కార్ల విక్రయాలు పడిపోయాయి. గత ఏడాది నవరాత్రి సమయంలో 2.34 లక్షల యూనిట్ల కార్లు అమ్ముడైతే, ఈసారి ఆ సంఖ్య 21.91 శాతం క్షీణించి 1.82 లక్షల యూనిట్లకు పరిమితమైంది.